


# న(మస్కా)రం

— పోట్లూరు సుబ్రహ్మణ్యం

"నమస్కారం సార్" తన ముప్పైఒకటో నమస్కారం చేసాడు సుబ్బారావు.

"ఏమిటోయ్ సుబ్బారావ్. ఏదో పనుండి వచ్చినట్టున్నావ్"

"ఏం లేదు సార్ విజయబాబుగారు ఎలా ఉన్నారో కనుక్కుందామని వచ్చాను. రెండు ఉత్తరాలు వ్రాసినా జవాబులేదు సార్" అందమైన అబద్ధం ఆడాడు.

"వాడికేమోయ్. వాడు మహర్జాతకుడు. మనమే ఇలా గుండేడి" కొడుకు విషయం చెబుతూంటే ఎంతో గర్వంగా ఫీలవుతున్నాడు ఎమ్మెల్యే.

"సార్! ఈసారి మీ ఉత్తరంలో నా నమస్కారాలు తెలియజేయండి"

"పోనీ నమస్కారాలు తప్ప ఇంకేమివ్వగలవులే నువ్వు" సుబ్బారావువైపు పరాన్నజీవి (పారసైట్)ని చూసినట్లు చూశాడు.

ఎమ్మెల్యేగారి భార్య భర్తకు కాఫీతెస్తూ సుబ్బారావుని చూసి "అరె సుబ్బారావ్ ఎప్పుడు వచ్చావోయ్. నీక్కూడా కాఫీ తెమ్మంటానుండు" అంటూ లోపలికి కేకేసింది. పనిమనిషి కాఫీతెచ్చి సుబ్బారావు కిచ్చింది.

సుబ్బారావు ఈ అకస్మిక అభిమానాన్ని భరించలేక ఏదో అనుమానమొచ్చి "అమ్మా! మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తెమ్మంటారా" అని విన్నవించుకొన్నాడు.

"నాయనా సుబ్బారావూ. నువ్వు మావాడి స్నేహితుడవు నీచేత కూరగాయాలు తెప్పిస్తామా. మాకూ పనిమనుషులున్నారు గదా" తృప్తిగా అందామె

"నన్ను ఎలా భావించినా ఫరవాలేదు నాకుమాత్రం ఏదయినా పని చెప్పండి" తిరుగులేనట్లు అడిగాడు.

"సరే నాయనా....ఏదో సరదాపడుతున్నావ్ నీ కోరిక నెందుకు కాదనాలి. కాస్త ఆ గదిలో బూజు దులిపిపెట్టు నాయనా, పనిమనిషికి అందడంలేదు" అంటూ ఓ మూల గది చూపించింది.

"అలాగేనండి అమ్మగారూ" అంటూ కాఫీ త్రాగడం పూర్తిచేసి గదిలోకి వెళ్ళి చీపురు, గది తుడిచే పెదురుగడ అందుకొన్నాడు.

సుబ్బారావు గదంతా పూర్తిగా తుడిచి బయటకొచ్చేసరికి గంటయింది.

ఇప్పుడు అతనికి క్రొత్తరూపం వచ్చేసింది గుడ్డలంతానల్లగాఅయిపోయాయి తలంతా బూజుతో వేళ్ళాడుతూ అప్పుడే దీర్ఘ తపస్సులోంచి లేచి వచ్చిన మునిలా ఉన్నాడు.

"చాల సహాయం చేసావు నాయనా. ఏదో పనిమీద వచ్చినట్టున్నావు. అదేమిటో చెప్పు" అంది ఎమ్మెల్యేగారి భార్య సుబ్బారావు శ్రమని గుర్తించి.

సుబ్బారావు నీళ్ళు నమిలాడు.

"సందేహించక చెప్పు నాయనా"

సుబ్బారావు నెత్తిమీద వేలాడే బూజును ఒక చేత్తో తీసిపారేసికొంటూ "తమరు దయతలిస్తే ఒక విషయం చెబుతానండీ" అంటూ వినయం నటించి, అయ్యగారు దయతలవక ముందే, లేక అయ్యగారు దయతలచినట్లు చెప్పకముందే అసలు విషయం తన హావభావ ప్రకటనలను జోడించి చెప్పాడు.

"సార్ ఈ ఉద్యోగం తప్పక వస్తుందని మా బావమరిదికి ప్రామిస్ చేసాను. ఈ సహాయం చేయలేకపోతే మా మామగారి ముందు తల ఎత్తుకొని తిరగలేను సార్. నా పెళ్లాం పుట్టింటికి పోతుంది. పిల్లలు మాట వినరు. నా ప్రెస్టేజి ఈ ఇష్యూ మీద ఆధారపడి ఉందిసార్" మొర పెట్టుకున్నాడు సుబ్బారావు.

ఎమ్మెల్యేగారు ఇబ్బందిగా ముఖంపెట్టి "అరెరె....సుబ్బారావ్ ఇంకొంచెం ముందు రావలసింది. దాన్ని మా దూరపు బంధువుల అబ్బాయి నారాయణకు ఇప్పిస్తానని మాటిచ్చాను ఏమనుకోకు" బాధపడుతూ అన్నాడు.

"సార్ ....సార్ .... అమ్మగారూ...అమ్మగారూ" ఆవు తంతూంటే దూడ పాల కోసం ఎగబాకినట్టుంది సుబ్బారావు బ్రతిమలాడడం. అతనికి, తన కళ్ళముందే తన అరచేతిలోని పదివేలరూపాయలనోట్లు రెక్కలొచ్చి ఎగిరిపోతున్న అనుభూతి కలిగింది.

"సుబ్బారావ్ వర్రీకాకు. ఈసారి అదేంతపనయినా నీకే చేస్తాను" అంటూ ఎమ్మెల్యేగారు టేబుల్ సొరుగులోంచి ఒక కవరు తీసాడు. "ఇది నారాయణకు ఉద్యోగమివ్వవలసినది అని వ్రాసిన ఉత్తరం. నమ్మకస్తుడవని నీకిస్తున్నాను జాగ్రత్తగా తీసుకువెళ్లి మేనేజరుకివ్వు" అంటూ కవరు సుబ్బారావు చేతిలో పెట్టాడు.

సుబ్బారావు కారిపోయే కన్నీటిని రెప్పలతో ఆనకట్ట కట్టి, వచ్చే ఏడుపును గొంతు దగ్గర బిగపట్టాడు. దీనికి అమ్మగారు కూడా తన ఓదార్పు మాటలతో కొంత సాయపడ్డారు. తినవలసిన ఆహారాన్ని తన చేతులమీదుగానే ఇంకొకరికి ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడినట్టు ఉత్తరం తీసుకుని బయలుదేరాడు.

సుబ్బారావుకు ఇతరుల ఉత్తరాలు చదవడమంటే ఐస్‌క్రీమ్ తిన్నట్లుంటుంది. దారిలో దాన్ని విప్పి పూర్తిగా చదివాడు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఉద్యోగం నారాయణకివ్వాలి' అని స్ట్రాంగుగా రాసి ఉంది అందులో. ఇంటికి వెళ్ళేసరికి ఆతృతగా ఎదురు చూస్తున్న తన బావమరిది నారాయణ, ఆశగా చూస్తున్న భార్య అలివేలు తనచుట్టూ చేరి చేతులు పట్టుకున్న పిల్లల్ని చూసేసరికి అతనికి ఒక పరిష్కారం మెదిలింది. అందరికీ ధైర్యం చెప్పాడు.

కుటుంబ సభ్యులంతా నిద్రాదేవి ఒడిలో వాలిన తరువాత సదరు ఉత్తరాన్ని బయటకు తీసాడు సుబ్బారావు అతి చాకచక్యంగా 'కె' అనే ఇంగ్లీషు అక్షరాన్ని 'ఆర్' గా దిద్దేశాడు. ఫలితం ఇప్పుడు తన బావమరిది ఆర్. నారాయణకు ఈ ఉద్యోగం వస్తుంది — అంటే తన బావమరిది ఇవ్వబోయే పదివేల రూపాయలు తనకు చెందుతాయన్న మాట.


మరునాడు ఉదయం ఉత్తరం మేనేజరుకు అందించడం, ఆయన ఆ ఉత్తరం చూసి తన ప్రమోషనుకు ప్లాను వేసుకొంటూ ఆనందంగా సుబ్బారావు బావమరిదికి ఉద్యోగం ఇవ్వడం జరిగిపోయింది. సుబ్బారావు బావమరిది ఎగిరి గంతేసి ఊహాల్ని రెక్కలు చేసుకుని ఇంట్లోవాలి రెండోరోజే ఎకరం పొలం అమ్మి పదివేలు తీసుకొచ్చి బావగారి దోసిట్లో పోసేసాడు. ఎమ్మెల్యేగారు ఏం చేస్తారోనని ఒకవైపు భయపడుతూనే, చేతిలో పడ్డ డబ్బు చూసుకుని పరమానందం చెందాడు. "సుబ్బారావుది తలకాయంత గుండె" అన్న



కృష్ణమూర్తి : సత్యభామా, నువ్వు ఒక్కమాట మాట్లాడితే చాలు ప్రపంచంలో అందరి కంటే నేనే అదృష్టవంతుడిననుకుంటాను! చెప్పు! నన్ను పెళ్లి చేసుకుంటావా?

సత్యభామ : చేసుకోను!

కృష్ణమూర్తి : థాంక్స్! అదే నేను కోరుకుంది.




స్నేహితుల ఉవాచ ఇప్పుడు నిజమైంది.

సుబ్బారావు ఇలా తన బంధువర్గానికి, స్నేహితులకు, ముఖం ఎరిగినవాళ్ళకు తగు ఆర్థిక లాభం పొందె ప్రజాహిత కార్యాలు చేస్తూండగా పదిహేనురోజుల తర్వాత ఒక ఆదివారం ఉదయం ఎమ్మెల్యేగారి దగ్గరనుండి ఆహ్వానం వచ్చింది. సుబ్బారావు ఏంచేయాలో తోచక అలాగే ఉండిపోయాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు మరలా పిలుపు రావడంతో బయలుదేరక తప్పలేదు.

సుబ్బారావు ఎమ్మెల్యేగారి ఇంటిముందు కొచ్చేసరికి మెయిన్‌గేటులోంచి బయటకు వస్తూ ఆయనగారి కారు కనిపించింది. డ్రైవరుకు చేయి ఊపి కారు ఆపాడు. కారులో డ్రైవరు మాత్రమే ఉన్నాడు. "సాబ్! అమ్మగారు హైదరాబాదునుంచి వస్తున్నారు స్టేషనుకు వెళుతున్నాను"

"అలాగా! అయితే నేనూ వస్తానుండు" అంటూ డోర్ తీసుకొని ఫ్రంట్ సీటులో కూర్చున్నాడు.

సుబ్బారావుకు ఆ కుటుంబంతో వున్న సన్నిహిత్వం డ్రైవరుకు తెలిసి ఉండడంతో మరేం అనలేదు. కారు రైల్వే స్టేషను చేరుకుంది.

సుబ్బారావు ఆలోచనల వేడితో కాలిపోతున్నాడు. ఎన్నెన్నో ప్లాన్లు వేస్తున్నాడు. ఏ ప్లానూ సమంజసంగా ఉండడం లేదు. తను చేసింది చిన్న పనేమీగాదు. మోసంచేసి తన బావమరిదికి ఉద్యోగం ఇప్పించుకున్నాడు. అంతవరకూ బాగానే వుంది. కాని ప్రస్తుతం ఈ ప్రమాదంనుంచి తప్పించుకోవడమెలా? ఆలోచిస్తున్న అతనికి ఎంతో సేపటికిగాని ఒక అయిడియా రాలేదు. ఆ అయిడియా ప్రకారం అసలువిషయం

చెప్పకుండా అమ్మగారిదగ్గర అభయ హస్తం తీసుకోవడం, తర్వాత ఎమ్మెల్యే గారిమీద శర పరంపరగా నమస్కార బాణవర్షం కురిపించి దాన్ని మాఫీ చేసుకోవడం!

ఇంతలో ట్రెయిను వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది. అమ్మగారు మహా కాయాన్ని మోసుకుంటూ ట్రెయిన్‌లోంచి దిగింది, సుబ్బారావు చిరునవ్వు నవ్వి ఒక విలువయిన నమస్కారబాణం వదిలాడు.

పోర్టరు, డ్రైవరుతో పోట్లాడి, మెడకొకటి, నెత్తినొకటి, చేతుల్లో రెండు శాస్త్రీలు పుచ్చుకొన్నాడు. పోర్టరు రూలు పొజిషన్ వివరిస్తే, సుబ్బారావు అమ్మగారి హోదాను నాలుగెత్తులు పెంచి తెల్లవారి ఇంటికొస్తే నాలుగురూపాయలు ఇస్తుందని చెప్పాడు.

సుబ్బారావు డ్రైవరు సహాయంలేకుండానే సామానంతా డిక్కీలో సర్దాడు. అమ్మగారు సుబ్బారావు వినయవిధేయతలకు ఎంతో ఆనందించింది. సుబ్బారావు జరిగిన విషయం చెప్పకుండా అయ్యగారు తన మీద కోపంగా ఉన్నారని, తనను రక్షించాలని కోరాడు. అమ్మగారు శ్రీకృష్ణుడు ఫోజు పెట్టిఅలాగేనని అభయమిచ్చింది. •

ఇంట్లోకి వచ్చిన భార్యను ఎంతో ఆప్యాయంగా పలకరించిన యమ్మెల్యేగారు, సామానులతో వెనకనేవచ్చిన సుబ్బారావును ఉరిమి చూసాడు-అతని కళ్ళు తీక్షణంగా మారాయి.

"నేను చెప్పిందేమిటి?నువ్వుచేసిందేమిటి" గద్దించాడు.

"మీరు సుబ్బారావును ఏమనకండి. అతను చాల మంచివాడు" అంటూ లోపలికి వెళ్ళింది.

అమ్మగారి వెనుకనే తలవంచుకొని వెళ్ళబోయిన సుబ్బారావును "ఆగు" అంటూ హుంకరించాడు.

'సార్ తప్పయిపోయింది, క్షమించండి" తన అంబులపొదిలోంచి ఒక బాణంతీసి

---



అయిదు నిమిషాలయినా నోరు విప్పలేక, దిగులుగా దీనంగా, కూర్చున్న పేషంట్‌నిచూచి డాక్టరుగారు ఎలాగయినా అతనికేం జబ్బో కనుక్కోవాలనుకున్నారు.

"చూడు నాయినా! నువ్వు బ్రాందీ, విస్కీల్లాంటివి తాగుతావా!"

"ఉహు!"

"సిగరెట్లు తాగుతావా?"


"ఉహు!"

"ఆడ పిల్లల వెంట పడడం లాంటిదేమయినా వుందా?"

"లేదండీ!"

"అయితే మరి నన్నేంచెయ్యమంటావో చెప్పు!" విసుక్కుంటూ అన్నాడు డాక్టరు.

"నాకు శుభ్రంగా బతకాలనుంది బాబోయ్-నాకు సహాయం చేయండి!" డాక్టరు మీదపడిపోయి భోరునఏడ్చేశాడు పేషంట్.




వదిలాడు రెండు చేతులు మోడ్చి నమస్కరిస్తూ.

ఆయన ఉగ్రుడయిపోయాడు. "నీవు చేసింది చిన్న తప్పనుకొన్నావా క్షమించడానికి. నన్ను చీట్ చేసావు. ఈ ఊర్లో నన్ను మోసం చేయగల ధైర్యం ఇప్పటి వరకూ ఎవడికీలేదు" తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు.

సుబ్బారావు తన అంబులపొదిలోంచి వరుసగా ఆగ్నేయాస్త్రము, వాయవ్యాస్త్రము, వరుణాస్త్రము వదలడం మొదలు పెట్టాడు మొదట నిటారుగా నిలబడి రెండు చేతులతో నమస్కరించాడు. తరువాత వంగి నమస్కరించాడు. చివరగా మోకాళ్ళమీద కూర్చొని నమస్కరించాడు. అయినా యమ్మెల్యేగారు తన తిట్ల ప్రవాహం ఆపలేదు. "ఇక లాభం లేదు. బ్రహ్మాస్త్రం ఉపయోగించక తప్పదు" అనుకొన్నాడు. అనుకొని చుట్టూ చూసాడు ఎవరయినా ఉన్నారేమోనని— సుబ్బారావుకు బ్రహ్మాస్త్రం వదిలేముందు అలా చూడడం అలవాటు, బ్రహ్మాస్త్రం యొక్క విలువ అటువంటిది.

ఎవరూ లేరని తీర్మానించుకొన్న తరువాత తన అంబులపొదిలోంచి బ్రహ్మాస్త్రం తీసి వదిలాడు. సుబ్బారావు ఒక్కసారిగా బోర్లాపడి ఆయన రెండు కాళ్ళూ పట్టుకొన్నాడు. ఆయన పడబోయి ప్రక్కనే ఉన్న స్థంభం ఆధారం చేసుకొని నిలబడ్డాడు. అయినా సుబ్బారావు కాళ్ళు వదల్లేదు. చివరకు సుబ్బారావు వదలిన బ్రహ్మాస్త్రం ధాటికి ఆయనగారు చల్లబడక తప్పలేదు.

ఈ లోపల అమ్మగారు స్నానంగట్రాచేసి హాల్లోకి వచ్చారు. ప్రస్తుత సన్నివేశం చూసి "ఇంకా మీరు సుబ్బారావును వదిలి పెట్టలేదా" అంది కోపంగా.

"నేనెప్పుడో వదిలి పెట్టాను, అతనే నన్ను వదలడంలేదు" అన్నాడు కంగారుగా. అమ్మగారి మాటంటే సుగ్రీవాజ్ఞ మరి.

o o o o

"మీ కోసం ఎవరో వచ్చారండి" అంది సుబ్బారావును తట్టి లేపుతూ అతనిభార్య. "ఎవరు" అన్నాడు నిద్రలోంచి లేవకుండానే.

"ఎవరోనండి చాలమంది ఉన్నారు."

సుబ్బారావుకు మత్తు క్షణంలో దిగిపోయింది. ఆశ్చర్యంగా బయటకువచ్చాడు. గుమ్మం ముందు అష్టదిగ్గజాల్లా నిలబడి ఉన్న ఎనిమిది మంది మనుషులూ ఏక కంఠంతో "దయగల మహాప్రభువులు" అంటూ అరచి సుబ్బారావు కాళ్ళమీద పడి సాష్టాంగ నమస్కారం చేసారు.

"అయ్యన్నండీ నా పేరు" పరిచయం చేసుకొన్నాడు నాయకుడు.

'అ' నుంచి 'ఏ' వరకు కూర్చినట్లు ఒక్కొక్కరు తమ పేరు చెప్పకొని తమకు తాము పరిచయం చేసుకొన్నారు.

"నాకు చందాలిచ్చే అలవాటు లేదు. ఇక దయచేయండి" గంభీరంగా అన్నాడు సుబ్బారావు.

పేరు చెబితే ఎటువంటి పనయినా అవుతుందని ఈ ఊరంతా తెలుసు. కనుక మా అందరికి రిక్షాలు లోనులో ఇప్పించి పుణ్యం కట్టుకోండి. నెలనెలా వాయిదాలు కడతాం" వచ్చిన పని చెప్పాడు నాయకుడు.

"ఇదేమన్నా ధర్మసత్రమా! నేనేమయినా ధర్మరాజునా రిక్షాలు లోనులో ఇప్పించడానికి" పైకి విసుక్కొన్నాడు సుబ్బారావు. లోలోపల తనకు ఇంత ప్రాధాన్యత ఇచ్చినందుకు ఉబ్బిపోతూ.

"సార్! నేను రిక్షావాళ్ళకు ప్రెసిడెంటుని. నమ్మకాని పెట్టింది పేరు. తమరా ధర్మప్రభువులు. మీరు మాకురిక్షాలిప్పించారంటే మా ఎనిమిది రిక్షాల్లో మీరు గాని, మీ ఇంట్లో మనుషులు ఎవరైనా గాని ఎప్పుడయినా, ఎక్కడయినా ఫ్రీగా పోవచ్చు. మేము మీ దగ్గర రిక్షాకు కూలి తీసుకోమని మనవి చేసుకొంటున్నాను" అన్నాడు నాయకుడు. మిగతావాళ్ళంతా అవునన్నట్లు తల వూపారు.

ఇంట్లో అందరికీ రిక్షాలు ఫ్రీ అనేసరికి సుబ్బారావు గుండె ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయింది, ఒక్క క్షణం ఆలోచించి, అందర్నీ మరుసటి రోజు ఉదయం రమ్మని, లోను ఇప్పిస్తానని అభయహస్తం పారేసాడు.

మర్నాడు ఉదయాన్నే వినయవిధేయతలతో నమస్కారం చేసి తన ఇంటి ముందు నిలబడ్డ అష్టదిగ్గజాలను తనతో బాంకుకు తీసుకువెళ్ళాడు సుబ్బారావు. ఆరోజు ఆఫీసుకు క్యాజువల్ లీవు పడేసాడు. సుబ్బారావుకు యమ్మెల్యేగారి ద్వారా బాంకు మేనేజరు తెలుసు. అందుకే బాంకు మేనేజరు సుబ్బారావును సాదరంగా ఆహ్వానించాడు

బాంకు మేనేజరు వాళ్ళిచ్చిన అప్లికేషన్లు పరిశీలించి "ష్యూరిటీ ఏమిస్తారు" అంటూ సుబ్బారావువైపు చూసాడు. సుబ్బారావు వాళ్లవైపు చూసాడు. అష్టదిగ్గజాలు రెండు చేతులెత్తి నమస్కరిస్తూ తమ దగ్గర సెకండు హాండులో కొన్న బట్టలు, దేవుడిచ్చిన శరీరంతప్ప మరేమీ లేవన్నట్లు సంజ్ఞ చేసారు.

సుబ్బారావుకు 'రిక్షాలు-ఫ్రీ సర్వీసు' పదేపదే మెదలుతుండడంతో తన ఇల్లును ష్యూరిటీగా పెట్టాడు. దాంతో, మేనేజరు సంతోషించి లోను శాంక్షనుకు సంబంధించిన పనుల్లో మునిగిపోయాడు.

అష్టదిగ్గజాల ముఖాలు నక్షత్రాల్లా వెలుగుతూ ఉంటే, సుబ్బారావు నక్షత్రమండలంలోని చంద్రుడిలా ప్రకాశించసాగాడు. చక్రవర్తికి అభివాదం చేసినట్లు అతనికి అడుగు అడుగుకు నమస్కారం చేస్తూ సుబ్బారావును పొగడ్తలతో ముంచేసారు అష్టదిగ్గజాలు.

ఇప్పుడు కొత్త రిక్షాలతో అష్టదిగ్గజాలు కళకళలాడిపోతున్నారు. సుబ్బారావు, అతని కుటుంబ సభ్యులు కింద కాలు పెట్టడంలేదు, సుబ్బారావు ఆఫీసుకు రిక్షాలో వెడుతున్నాడు. పూర్వం భార్యగాని, పిల్లలుగాని ఎంతపోరు చేసినా మైళ్లకు మైళ్ళు నడిపించేవాడేగాని రిక్షాకు పైసా పెట్టేవాడుకాదు. ఇప్పుడు పిల్లలు స్కూలుకు పోవాలన్నా, భార్య షాపింగుకు వెళ్ళాలన్నా, బంధువులు వస్తున్నా రిక్షాలు సిద్ధంగా ఉండాల్సిందే. రోడ్డు మీద రొదపెడుతూ తిరిగే టౌను బస్సుల్లా, ఆ ఎనిమిది రిక్షాల్లో ఏదో ఒకటి దారిలో తటస్థపడుతూ ఉండేవి. గుప్తులకాలం నాటి స్వర్ణయుగంలాఉంది సుబ్బారావు పని.

o o o o

ఆరోజు సుబ్బారావు ఇంటిముందు కాలు గాలిన పిలిన పిల్లిలా తిరుగుతున్నాడు. రోజూ ఉదయం పదిగంటలకే వచ్చేరిక్షా పదకొండు గంటలయినా రాలేదు. వంతు ప్రకారం ఈరోజు ఎలమంద రిక్షా రావాలి. వాడు రాకపోతే పోయింది. వాడి ముఠాలో వాళ్ళు ఒక్కరూ కనిపించరే అనుకొన్నాడు. చివరకు ఒక నిశ్చయానికి వచ్చి వీధి చివరివరకూ నడచివెళ్ళాడు. అక్కడొక ముసలిరిక్షావాడు కనిపిస్తే వీళ్ళంతా ఎక్కడికి పోయారని అడిగాడు.

"ఆళ్ళు ఇంకెక్కడున్నారు బాబూ. అద్దరేత్తిరి పెళ్ళాం పిల్లలతో గుడిసెలు కాలీజేసి లారీలో ఎల్లిపోయిన్రు. మద్రాసుకు పోయిన్రో, మహారాట్రకో తెలవదు. ఆళ్ళని నమ్మడానికి లేదు సార్. దొంగలంజా కొడుకులు" ముసలివాడు పళ్ళు కొరుకుతూ కోపంగా అన్నాడు.

అంతే! సుబ్బారావు గుండె కొట్టుకోవడం మానేసింది. ఒక్కొక్కరు నెలకు వంద చొప్పున ఇరవై అయిదు వాయిదాలు కట్టాలి. అయితే వాళ్ళు కట్టింది అయిదు వాయిదాలు మాత్రమే. అంటే నాలుగు వేలు తీరిపోయిందన్నమాట. ష్యూరిటీ ఇచ్చినందుకు తను మిగిలిన పదహారు వేలు కట్టాలి. ఎంత ఘోరం? సుబ్బారావు దుఃఖంతో కుంగిపోయాడు. ఆలోచనల్లోంచి తేరుకొని, కర్తవ్యం స్ఫురించగా పోలీసుస్టేషను వైపు పరుగెత్తాడు పూర్ సుబ్బారావు. ●

